క్లుప్తంగా

ఆనంద అర్పినికి ఉత్తమ నర్సు అవార్డు

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మారేపల్లి ఆనంద అర్పిని ఉత్తమ నర్సు అవార్డు అందుకున్నారు. నర్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలందించినందుకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ఇంటర్నేషనల్ వర్కింగ్ నర్స్ డే వేడుకల్లో ఆమె అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం ఆమె వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో ఇన్‌చార్జ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

కమలాపూర్ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సన్న, చిన్నకారు రైతుల నుంచి పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ గుండె బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకంలో మామిడి, బత్తాయి, జీడి మామిడి, జామ, సీతాఫలం, సపోటా, ఆయిల్ పామ్, అల్లనేరడి, ఆపిల్‌బేర్, దానిమ్మ, నిమ్మ, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలతో పాటు పొలం గట్లపై అల్ల నేరడి, కొబ్బరి, జామ, సీతాఫలం, కరోడా వంటి పండ్ల మొక్కలు పెంచుకునేందుకు రైతుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్, నీటి సౌకర్యం కలిగిఉన్న ఆసక్తి గల సన్న, చిన్నకారు రైతులు ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాస్‌బుక్, ఉపాధి హామీ జాబ్‌కార్డు, గ్రామపంచాయతీ తీర్మానం, బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు జత చేసి గ్రామపంచాయతీ కార్యాలయంలో లేదా మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తులు అందించాలని కోరారు. ఉపాధిహామీ కూలీలతో గుంతలు తీయించడం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొక్కల ఖర్చులు, అంతర పంటల నిర్వహణ ఖర్చులు, ఎరువుల ఖర్చులు, ప్రతీనెల నీటి నిర్వహణ ఖర్చులు కూడా చెల్లిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థుల ఫీజు బాధ్యత ప్రభుత్వానిదే

శాయంపేట : ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివిన విద్యార్థులకు ఎంసెట్‌లో కన్వీనర్ కోటలో ఇంజనీరింగ్, బీ–ఫార్మసీ, బీఆర్క్(ఆర్కిటెక్చర్) కోర్సుల్లో సీటు పొందిన విద్యార్థులకు ప్రభుత్వమే పూర్తిగా ఫీజును చెల్లిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కందట్ల కోటేశ్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులందరికీ ఎంసెట్ ర్యాంకుతో సంబంధం లేకుండా వర్తిస్తుందని తెలిపారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1.5లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీకి నీళ్లు బంద్

ఆత్మకూరు : గ్రామంలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీకి గ్రామపంచాయతీ సిబ్బంది నీటి సరఫరా నిలిపివేశారని అలాగే వీధి దీపాలు బంద్ చేశారని స్థానికులు మంగళవారం ఆరోపించారు. గ్రామపంచాయతీలో ఇళ్లు నమోదు చేసుకోలేదని, అలాగే పన్నులు చెల్లించడం లేదని సాకుతో నీటి సరఫరా నిలిపివేశారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

చర్చనీయాంశంగా రేషన్ డీలర్ పేరు మార్పిడి

శాయంపేట : మండలంలోని జోగంపల్లి గ్రామంలో రేషన్ పేరు మార్పిడి చర్చనీయాంశంగా మారింది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం.. 20 ఏళ్ల క్రితం చెక్క సదయ్య 18 నంబర్ గల రేషన్ షాపు నిర్వహిస్తు అనారోగ్యంతో 2004లో మృతిచెందాడు. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం చెక్క సదయ్య కూతురు రజితను డీలర్‌గా నియమించింది. 2005 నుంచి 2024 వరకు రేషన్ డీలర్‌గా రజిత కొనసాగారు. ఈ క్రమంలో రజిత తమ్ముడు చెక్క శ్రీధర్ రేషన్ షాపును కొనసాగించేవాడు. 2024లో పేరు మార్పిడి కోసం సదరు డీలర్ రజిత, తమ్ముడు శ్రీధర్ రెవెన్యూ అధికారులను సంప్రదించారు. తన స్థానంలో తన మరదలు చెక్క రమ పేరుపై మార్పిడి చేయాలని తహసీల్దార్‌కు దరఖాస్తుతో పాటు అఫిడవిట్ అందజేశారు. డీలర్ పేరు మార్పిడి జరుగాలంటే రేషన్ డీలర్‌గా కొనసాగేవారు చనిపోతే విరాసత్ ద్వారా వారి వారసులకు డీలర్‌గా నియమించే అవకాశం ఉంటుందని, కానీ విచిత్రంగా రేషన్ డీలర్ల జీఓకు విరుద్ధంగా డీలర్ పేరు మార్పిడి జరిగిందని పలువురు చర్చించుకుంటున్నారు. కాగా ఈ విషయమై తహసీల్దార్ సత్యనారాయణను వివరణ కోరగా.. జోగంపల్లి రేషన్ షాపు డీలర్‌గా గతంలో వారసులుగానే నియమకమయ్యారని, ఆ సమయంలో అతడి సోదరుడు మైనర్ కావడం వలన డీలర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె తాజాగా తన సోదరుడి భార్యను తన స్థానంలో డీలర్‌గా నియమించాలని కోరుతూ అఫిడవిట్ అందించినట్లు తెలిపారు. 2024లో పేరు మార్పిడి కోసం దరఖాస్తు చేసుకోగా 2025లో గ్రామస్తుల సమక్షంలో ఆర్ఐతో విచారణ జరిపించి నివేదికను ఉన్నతాధికారులకు పంపించామన్నారు.

శిథిలావస్థలో చలివాగు చెక్‌డ్యాం

- నిర్మించి 50 ఏళ్లు.. మరమ్మతులు చేసి 20 ఏళ్లు
- వర్షాకాలంలో ప్రయాణికులకు తప్పని తిప్పలు
- అసంపూర్తిగానే కొత్త చెక్‌డ్యాం నిర్మాణం
- పట్టించుకోని పాలకులు, అధికారులు


అడుగుభాగం కొటుకుపోయి కనిపిస్తున్న చలివాగు చెక్‌డ్యాం

పరకాల : సుమారు 2 వేల ఎకరాలకు సాగునీరు అందించే పరకాల చలివాగు చెక్‌డ్యాం శిథిలావస్థకు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాభై ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన చెక్‌డ్యాం రోజురోజుకు శిథిలమవుతున్నా మరమ్మతులపై ఇరిగేషన్‌శాఖ అధికారులు, పాలకులు ఏ మాత్రం దృష్టిసారించకపోవడంతో సాగునీటి కోసం నిల్వచేసిన నీరు వృథా అవుతుంది. వాస్తవానికి ప్రతీ ఏడాది వర్షకాలంలో వాగు పొంగిపొర్లుతుండటంతో చెక్‌డ్యాం ఎక్కడ కొట్టుకుపోతుందోనని.. సాగు నీటి కష్టాలు పడాల్సి వస్తుందని చెక్‌డ్యాం కాల్వ పరిసరప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేసవి కాలంలో పంట పొలాల సాగు కోసం చలివాగు ప్రాజెక్ట్‌ను నింపి ఉంచారు. నీటిని వినియోగించుని సుమారు వెయ్యి ఎకరాలను పంటసాగు చేశారు.

20 ఏళ్ల క్రితం మరమ్మతులు

చలివాగు చెక్‌డ్యాం ఎత్తును పెంచడం వలన సాగు నీటి కష్టాలతో పాటు తాగునీటి కష్టాలు తీరుతాయనే ఆలోచనతో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి సర్పంచ్‌గా పనిచేస్తున్న సమయంలో ప్రత్యేక చొరవ చూపి మరమ్మతు చేయించారు. దీంతో రైతులకు తాగునీటి కష్టాలు కొంత తగ్గుముఖం పట్టాయి. భారీ వర్షాలకు చెక్‌డ్యాం శిథిలావస్థలోకి చేరుకున్నప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదు.


రంధ్రాలు పడిన చెక్‌డ్యాం

కోట్లు ఖర్చుచేసినా జాడలేని కొత్త చెక్‌డ్యాం

సాగునీటి నిల్వల సామర్థ్యం పెంచడం కోసం పరకాల చలివాగు చెక్‌డ్యాంకు కొంత దూరంలో రూ.4కోట్ల 36లక్షల నిధులు మంజూరు చేయగా అసంపూర్తి పనులు చేసి సంబంధిత కాంట్రాక్టర్ రూ.3కోట్ల బిల్లు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొత్త చెక్‌డ్యాం నిర్మాణంపై అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తక్షణమే పూర్తిచేయాలి



సాగునీరుతో పాటు తాగునీటి కష్టాలు తీర్చే పరకాల చలివాగు చెక్‌డ్యాం నీటి సామర్థ్యం పెంచుతూ అసంపూర్తిగా ఉన్న కొత్త చెక్‌డ్యాం నిర్మాణాన్ని పూర్తి చేయాలి. ప్రతీ వర్షకాలం నీరు వృధాగా పోవడంతో ప్రాజెక్ట్ నీటిపై ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుంది.

– నక్క చిరంజీవి, వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ శ్రీజన్


మాట్లాడుతున్న శ్రీజన్, హేమాశరత్

ఎల్కతుర్తి : రైతులు సాగు చేసే పంటల్లో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవడంతో పాటు సహజ సాగు పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడి పొందాలని శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.శ్రీజన్, హేమశరత్ సూచించారు. మంగళవారం ఎల్కతుర్తి మండలం పెంచికలపేట, వల్భాపూర్ గ్రామాల్లో జరిగిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీజన్, హేమశరత్ పాల్గొని మాట్లాడారు. రైతులు అధిక యూరియా వాడకాన్ని నివారించాలని సూచించారు. సాగుకు అవసరం మేరకే నీటిని వినియోగించుకోవాలన్నారు. నీటి ఆదా పద్ధతులను వివరించారు. అలాగే వ్యవసాయ ఇన్‌పుట్ బిల్లులను జాగ్రత్తగా పొందుపర్చుకోవాలన్నారు. పొలం గట్ల వెంబడి చెట్ల పెంపకం, భూసార పరీక్షల ప్రాముఖ్యత, సేంద్రియ ఎరువుల వాడకం, నేల సారాన్ని మెరుగు పరుచడానికి పచ్చిరొట్ట ఎరువుల పంట పెంచుకోవడం, బీటీ విత్తన పరీక్ష, పంట మార్పిడి, అధిక సాంద్రత కలిగిన పత్తి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏఓ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువు విత్తనాల లభ్యత గురించి రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు అంజలి, తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, చైతన్యరెడ్డి, ఆర్ఐ నెహ్రూ రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

- జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్


మాట్లాడుతున్న డీఏఓ రవీందర్ సింగ్

కమలాపూర్: నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతులకు విక్రయించొద్దని జిల్లా వ్యవసాయ అధికారి బి.రవీందర్ సింగ్.. డీలర్లను హెచ్చరించారు. స్థానిక డీలర్లకు ఎరువులు, పురుగు మందులు, విత్తన చట్టాలపై మంగళవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను మోసగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, లైసెన్స్ రద్దు చేయడంతో పాటు వారిపై కేసులు పెడతామన్నారు. వ్యవసాయ అధికారి (సాంకేతిక) కమలాకర్ మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందుల విషయంలో డీలర్లు చేస్తున్న తప్పిదాలను వివరించారు. డీలర్లు స్టాక్ నిల్వలను ప్రతీనెల మొదటి వారంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎం.రాజ్‌కుమార్ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల చట్టాలపై డీలర్లకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఏడీఏ రాజ్‌కుమార్, డీలర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు నూక సాంబమూర్తి, ఉపాధ్యక్షుడు కిశోర్, డీలర్లు సాంబశివుడు, గట్టు నారాయణ, రాజిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

దామెర : మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శిఖర జీర్ణోద్ధరణ సహిత సుదర్శన శిఖర కలశ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సామూహిక హోమాల భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసచార్యులు వేదమంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మంటపార్చన, మహాస్నపన విధి, ధాన్యాధివాసం, శయ్యాదివాసం, పుష్పాదివాసం కార్యమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, మాజీ సర్పంచ్ జక్కుల రాణిరవి దంపతులు, వివిధ పార్టీ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం చివరి రోజున రత్నన్యాసం, ధాతున్యాసం, బీజన్యాసం కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఉదయం 9 గంటల 9 నిమిషాలకు పంచలోహ సహిత శ్రీసుదర్శన శిఖర కలశ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు శ్రీనివాసచార్యులు తదితరులు తెలిపారు.

సైన్స్ గ్రూపు మంజూరు చేయాలని వినతి



ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం హనుమకొండలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ బి.నర్సింహారెడ్డి వినతిపత్రం అందించారు. కళాశాలలో సైన్స్ గ్రూపు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి సైన్స్ గ్రూపు మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి భరోసా ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

మొరం తరలిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి


మొరం తవ్వకాల ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు : అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అధికారులను కోరారు. మంగళవారం మండలంలోని నాగయ్యపల్లి చెరువు వద్ద మొరం అక్రమంగా తరలిస్తుండగా స్థానిక తహసీల్దార్, సీఐ, ఇరిగేషన్ ఏఈ దృష్టికి తీసుకెళ్లగా, స్థానిక తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్సై తిరుపతి, ఏఈ జ్యోతిరాణి చెరువు వద్దకు చేరుకుని మొరం పనులను నిలిపినట్లు తెలిపారు. చెరువు మత్తడికి అడ్డుగా వేసిన రోడ్డును తొలగిస్తామని అధికారులు పేర్కొన్నారు. కాగా డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ మాట్లాడుతూ.. గతంలోనే అధికారులకు వినతిపత్రం సమర్పించినప్పటికీ పట్టించుకోలేదని అన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేశ్, నాయకులు క్రాంతి, లక్ష్మి, సరోజన పాల్గొన్నారు.

ఆలయానికి మత్స్యగిరిస్వామి



శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరి స్వామి ఆలయంలో కొనసాగుతున్న తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం మచ్చర్లయ్య గుట్ట నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయానికి తీసుకెళ్లి అర్చకులు ఆరుట్ల శ్రీకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి, కృపాకర్‌రెడ్డి, యూత్ నాయకులు నాగరాజు, గోపి, భక్తులు పాల్గొన్నారు.

మెరిసిన ఎస్ఆర్ సీఎస్ సీబీఎస్ఈ స్కూల్



విద్యార్థులతో డైరెక్టర్ రాజిరెడ్డి

ధర్మసాగర్ : మండలంలోని ఉనికిచర్ల శివారులోని ఎస్ఆర్ సీఎస్ సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి తెలిపారు. మంగళవారం సీబీఎస్ఈ బోర్డు ప్రకటించిన ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు శ్రీ లక్ష్మీ ప్రియకు 500 మార్కులకు 389 మార్కులు, ఆర్యన్ 380 మార్కులు, బిట్టు నాయక్ 375 మార్కులు, వర్షిని 369 మార్కులు సాధించి అత్యంత ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా పాఠశాల మిగతా విద్యార్థులు 300 పైగా మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. సబ్జెక్టు వైస్‌గా మార్కులు సాధించిన విద్యార్థుల్లో.. తెలుగులో 90, ఇంగ్లిష్‌లో 86, మ్యాథ్స్‌లో 80, సైన్స్‌లో 81, అలాగే సోషల్లో 81 మార్కులు సాధించి రామానుజన్ స్కూల్ టాపర్‌గా నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్ రాజిరెడ్డి, కరస్పాండెంట్ ముచ్చ అరుణ, ఏఐసీసీ సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అభినందించారు.

పోక్సో కేసులో ఒకరి అరెస్టు

దామెర : పోక్సో కేసులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన హనుమకొండ జిల్లా దామెర పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఏసీపీ సతీశ్‌బాబు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన 17 సంవత్సరాల బాలికను సింగరాజుపల్లికి చెందిన ఓ యువకుడు కొన్ని రోజుల కిత్రం మాయమాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్నాడు. అనంతరం ఈ విషయం సదరు బాలిక తల్లిదండ్రులకు తెలుపగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాలిక వాంగ్మూలం తీసుకున్న పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

రేపు సంత ప్రారంభం

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ఈనెల 15వ తేదీన గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వారాంతపు సంతను ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. గ్రామంలో ప్రతి గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వారాంతపు సంత కొనసాగనున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- న్యాయవాది పుల్లా ప్రవీణ్‌కుమార్


న్యాయవాది ప్రవీణ్‌ను సన్మానిస్తున్న సీనియర్ జర్నలిస్టులు

కమలాపూర్ : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను అధికారులు, పాలకులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరింపజేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తారని న్యాయవాది పుల్లా ప్రవీణ్‌కుమార్ అన్నారు. తాను న్యాయవాద వృత్తి చేపట్టి 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్టులను తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఆయన ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమాన్ని పత్రికలు, చానళ్ల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పింది జర్నలిస్టులేనని కొనియాడారు. సమాజంలోని అసమానలను రూపుమాపేందుకు పాత్రికేయులు కృషి చేస్తున్నారని అన్నారు. అలాంటి గొప్ప వృత్తిలో కొనసాగుతున్న జర్నలిస్టులను సన్మానించుకునే అవకాశం దక్కడంతో సంతోషంగా ఉందని అన్నారు. న్యాయవాద వృత్తిలో 15 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రవీణ్‌కుమార్ పేదలకు న్యాయ సహాయం అందిస్తూ ముందుకు సాగాలని జర్నలిస్టులు ఆకాంక్షించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులు నిర్వాహకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుల్లా కొమురయ్య, నవీన్, జర్నలిస్టులు పులికంటి రాజేందర్, మిట్టపెల్లి ప్రభాకర్, గాజుల సతీశ్, పబ్బు సతీశ్, బండారి రాజు, బాలసాని దేవేందర్, గట్టు రఘు, తాళ్ల శ్రీనివాస్, వెల్ది కుమార్, మోడెం రాజ్‌కుమార్, కొనిశెట్టి మునీందర్, ఒస్కుల డేవిడ్, ఆడెపు సురేశ్, పులికంటి ప్రభాకర్, వేల్పుల చిరంజీవి, డాక్టర్ మౌటం కుమారస్వామి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి


బడిబాటలో పాల్గొన్న కౌన్సిలర్ ఉమాదేవి దంపతులు, ఉపాధ్యాయులు

పరకాల : బడీడు పిల్లలందరని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పరకాల మున్సిపాలిటీ 14వ వార్డు మాజీ కౌన్సిలర్ మార్క ఉమాదేవి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు టి.రాజయ్య ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఉమాదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించడం వలన విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం ఉండదన్నారు. విద్యార్థులకు ఉచిత విద్య, ఉచిత పుస్తకాలు, ఉచితంగా దుస్తులు, మధ్యాహ్న భోజనం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో విద్యా బోధన ఉంటుందని, తద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉటుందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఏపీసీ చైర్మన్ కె.సరిత, మహిళల గ్రూపు సభ్యులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపన విగ్రహాలకు జలాభిషేకం


ఎల్లమ్మ విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న అర్చకులు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ఐనవోలు : మలికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు రెండోరోజు మంగళవారం వైభవంగా జరిగాయి. కోమల్లపల్లి సంపత్‌కుమార్ రుత్విక్ బృందం ఆధ్వర్యంలో ఆలయంలో ప్రతిష్ఠించనున్న ఎల్లమ్మ, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ఊరేగించి జలాభిషేకం నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశనం, వాస్తు పూజ, వాస్తు శాంతి, పర్యగ్నికరణ, లక్షణోద్ధారణ, జలాధివాసం, బింబ శుద్ధి, పాలాభిషేకం చేశారు. సాయంత్రం ధాన్యాధివాసం, పంచ శయ్యాది వాసం, శాంతి హవనం, పంచావరణ స్థాపన, తత్త్వత్రయ మూలమంత్ర హవనం జరిపించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్ప సమర్పణ, నిత్యబలిహరణ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ఆలయ నిర్మాణ దాత పర్ష సర్వేశ్వర్‌రావు యాదవ్ కుటుంబ సభ్యులు, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి


సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

ధర్మసాగర్ : పోలీస్ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. నూతనంగా కాజీపేట ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదుదారులు వస్తే వారి సమస్యలు తెలుసుకుని సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. అదే విధంగా గంజాయి ఇతర మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేయాలని, రవాణా చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా సూచించారు. సైబర్ క్రైమ్ నేరాలపై అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని, పోలీస్ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు స్థానిక సీఐ ప్రవీణ్ కుమార్, మడికొండ, కాజీపేట సీఐలు పుల్యాల కిషన్, సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు, ఏఎస్సైలు, హెచ్‌సీలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేలేరు : మండలంలోని పీచర జెడ్పీహెచ్ఎస్‌లో 2007–2008 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 17 సంవత్సరాల అనంతరం కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను శాలవాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులంతా కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఉపాధ్యాయులు రాజునాయక్, చందర్‌రావు, ఈశ్వర్, బియాబాని, జాఫర్‌ఆలీ, బాబు, ప్రశాంతి, శేఖర్‌బాబు, ఇందిర, అరుణ పాల్గొన్నారు.